సాక్షి ప్రకాశం

ఆదివారం । 18 । మే । 2025



సంక్షేమ పథకాల అమలు జగనన్నకే సాధ్యం

పేదల కోసం సంక్షేమ పథకాల అమలు జగనన్నకే సాధ్యమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. - 8లో..



ట్రాక్టర్ల సామగ్రి దొంగకు బేడీలు

చెడు వ్యసనాలకు లోనై ట్రాక్టర్ల సామగ్రి దొంగిలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో సీఐ ప్రభాకర్ వివరాలు వెల్లడించారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38 /28

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

తిరగబడ్డ జెండా రంగులు



టీషర్టు పై తిరగబడ్డ త్రివర్ణపతాకం

దర్శి(కురిచేడు): వీర సైనికులకు మద్దతుగా శనివారం దర్శి పట్టణంలో త్రివర్ణపతాకాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మితో పాటు ఆమె భర్త డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మున్సిపల్ కమిషనర్ మహేష్, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, సీఐ రామారావు, మాజీ సైనికోద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. త్రివర్ణ పతాకానికి ఎక్కడా అవమానం జరగకూడదు. అది దేశానికి అవమానం జరిగినట్లు అవుతుందని ప్రతి పౌరుడు భావిస్తారు. అయితే ర్యాలీలో చాలా మంది ధరించిన తీవ్రర్ణ పతాకం టీ షర్టులపై త్రివర్ణాలు తిరగబడ్డాయి. ఈ విషయాన్ని ర్యాలీ నిర్వాహకులు సైతం గమనించకపోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లారీని ఢీకొట్టిన ట్రావెల్ బస్సు



లారీని ఢీకొన్న బస్సు

ఒంగోలు టౌన్: వేగంగా వెళుతున్న ట్రావెల్ బస్సు అదుపుతప్పి లారీని ఢీకొట్టింది. పోలీసుల కథనం ప్రకారం..అమరావతిలోని ఉద్దండరాయుని పాలెం నుంచి తమిళనాడులోని నాగపట్నం వెళుతున్న మార్నింగ్ స్టార్ బస్సు తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో నగర శివారులోని త్రోవగుంట ఫ్లైఓవర్ బ్రిడ్జి మీద ముందు వెళుతున్న లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో 26 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన జుజ్జవరపు కోటమ్మ, మంద బుల్లమ్మాయి, పులిషారం పుష్ప, తుళ్లూరు మండలంలోని వెలగపూడి గ్రామానికి చెందిన చలివేంద్ర శ్రీలేఖ, రాయనపాడు గ్రామానికి చెందిన జుజ్జవరపు విక్రమ్, ఉద్దండరాయనిపాలెం గ్రామానికి చెందిన పులి పుష్పలను జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురం గొంతులో నీటి ముల్లు..!

పశ్చిమ ప్రకాశానికి ముఖ ద్వారం మార్కాపురం. అక్కడ బిందెడు నీటి కోసం బండెడు కష్టాలు పడుతున్నారు పట్టణవాసులు. అధికారుల నిర్లక్ష్యం.. ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపం వెరసి ప్రజలను నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. వారం రోజులకోసారి సాగర్ నీటిని ప్రజలకు అందిస్తుండడంతో ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణణాతీతం. దూపాడు ఎస్ఎస్ ట్యాంకులో నీళ్లున్నా అందించలేని దుస్థితి. సుమారు లక్ష జనాభా ఉన్న పట్టణంలో అధికారుల మధ్య సమన్వయలోపం నీటి సమస్య తీవ్రరూపానికి కారణంగా మారుతోంది.

- 6 రోజులకొకసారి సాగర్ నీటి సరఫరా
- పైపులైన్లు పాడైతే నరకమే
- అడుగంటిన డీప్ బోర్లు
- శివారు కాలనీల్లో నీటి సమస్యలు
- ఎస్ఎస్ ట్యాంకులో నీరున్నా..
- ప్రజలకు తప్పని నీటి కష్టాలు



మార్కాపురం టౌన్:

పట్టణ ప్రజలు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని అప్పటి ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి రాజీవ్ నగరబాటలో భాగంగా మార్కాపురం పర్యటనకు వచ్చిన ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్య పరిష్కారానికి వెంటనే ఆయన రూ.45 కోట్లు మంజూరు చేశారు. దీంతో దూపాడు వద్ద నుంచి సుమారు 28 కిలోమీటర్ల మేర మార్కాపురానికి పైపులైన్లు ఏర్పాటు చేసి సాగర్ నీటి సరఫరాకు శ్రీకారం చుట్టారు. 2,200 మిలియన్ లీటర్ల కెపాసిటీతో దూపాడు వద్ద సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మించారు. నాటి నుంచి ప్రజలకు సాగర్‌నీటిని అందిస్తుండటంతో ఇబ్బందిలేకుండా కొనసాగింది. ప్రస్తుతం పట్టణ విస్తీర్ణం పెరగడంతో పాటు జనాభా కూడా పెరుగుతూ వస్తోంది. వారి అవసరాలకు సరిపడా నీటిని అందించలేకపోతున్నారు. అయితే, దూపాడు నుంచి కేశినేనిపల్లి వరకూ సుమారు 3 కిలోమీటర్ల మేర జీఆర్‌పీ పైపు లైను తరచూ మరమ్మతులకు గురికావడంతో ప్రజలకు నీటి కష్టాలు మరింత ఎక్కువయ్యాయి. పైపులైన్లు పగిలితే ప్రజలకు నరకమే. గతంలో నాలుగు రోజులకొకసారి నీటిని అందించేవారు. ప్రస్తుతం వారానికొకసారి అందించడం కూడా గగనంగా మారింది. పైపులైన్లు మరమ్మతులకు గురైతే మరో మూడు రోజులు అదనంగా సమయం పడుతోంది. ఇదే అదునుగా నీటి వ్యాపారులు రెచ్చిపోతున్నారు. ట్యాంకర్ నీటిని రూ.500 వరకూ విక్రయిస్తున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉంటే మరో రూ.200 అదనంగా తీసుకుంటున్నారు.

శివారు ప్రాంతాల్లో నీటి కష్టాలు...

మార్కాపురం పట్టణంలోని శివారు ప్రాంతాలైన రాజ్యలక్ష్మీనగర్, చెన్నకేశవనగర్, బాపూజీకాలనీ, పూలసుబ్బయ్యకాలనీ, కొండారెడ్డికాలనీ, ఇందిరమ్మ కాలనీ, ఎస్సీ, బీసీకాలనీ, సుందరయ్యకాలనీ, ఎస్టేట్, డ్రైవర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉన్న డీప్‌బోర్లలో కొన్ని అడుగంటిపోవడంతో నీటికి ఇబ్బందులు పడుతున్నారు. అరకొరగా నీరు వచ్చే డీప్‌బోర్ల వద్ద నీటిని పట్టుకుని వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణంలో సుమారు 185 వరకూ డీప్‌బోర్లు ఉన్నాయి. ప్రస్తుతం వేసవికాలం కావడంతో భూగర్భ జలాల మట్టాలు తగ్గిపోతూ వస్తున్నాయి. 180 బోర్లలో నీరు పూర్తి స్థాయిలో రావడంలేదు. బోర్లు ఎండిపోయిన ప్రాంతాలకు మున్సిపాలిటీకి చెందిన రెండు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అవి కూడా సక్రమంగా రాకపోవడంతో బిందెనీటిని రూ.పదికి కొనుగోలు చేయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.



ఎస్ఎస్ ట్యాంకులో ఉన్న నీరు

నీటి ఇబ్బంది లేకుండా చూడాలి



వేసవి కాలం దృష్ట్యా పట్టణ ప్రజలకు నీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. నీటి సమస్య ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసి ప్రజల కష్టాలు తీర్చాలి. నీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లే సమస్య లేకుండా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలి.

– అందె నాసరయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మార్కాపురం

బిందె రూ.10 పెట్టి కొంటున్నాం



మార్కాపురం పట్టణంలో మేము నివాసముండే పూలసుబ్బయ్యకాలనీలో నీటి సమస్య ఎక్కువగా ఉంది. అధికారులు ట్యాంకర్ల ద్వారా అందిస్తున్న నీరు సరిపోవడం లేదు. ఇంటింటికి కుళాయి బిగించి నీటిని అందించాలి. ట్యాంకర్ల సంఖ్య పెంచాలి. వేసవికాలం కావడంతో బోర్లు కూడా ఎండిపోయాయి. తాగునీటిని బిందె రూ.10 ప్రకారం కొనుగోలు చేస్తున్నాం.

– జలుకూరి నాగయ్య, పీఎస్ కాలనీ

పైపులైన్లు పూర్తయితే మూడు రోజులకోసారి సాగర్ నీరు



దూపాడు నుంచి కేశినేనిపల్లి వరకూ సుమారు 3 కిలోమీటర్ల మేర ఉన్న పైపులైన్లకు పనులు జరుగుతున్నాయి. ఈ పైపులైన్ల పనులు పూర్తయితే పట్టణ ప్రజలకు మూడురోజులకోసారి సాగర్ నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. డీప్‌బోర్లు అడుగంటిన ప్రాంతాలకు మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నాం. నీటికి ఇబ్బంది పడుతుంటే మున్సిపల్ సిబ్బంది దృష్టికి తీసుకురండి.

– భూపాల్‌రెడ్డి, మున్సిపల్ ఏఈ



ఉచిత విద్యకు నిబంధనాలు

- విద్యాహక్కు చట్టం-2009కు తూట్లు
- నిబంధనలతో పేద పిల్లలు కార్పొరేట్ విద్య దూరం
- ఉచిత సీట్లు పొందలేకపోతున్న గ్రామీణ విద్యార్థులు
- నిబంధనలు సడలించాలంటున్న విద్యావేత్తలు

బేస్తవారిపేట: విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం పేద, బలహీన వర్గాలకు చెందిన పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించాలి. అయితే విద్యార్థి నివాసం నుంచి ఒకటి లేదా మూడు కిలోమీటర్ల లోపు పాఠశాల ఉండాలనే నిబంధన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు శాపంగా మారింది. ప్రైవేట్ పాఠశాలలు ఎక్కువ శాతం పట్టణాల్లోనే ఉండటంతో ఆ పరిసర ప్రాంతాలకు చెందిన వారే ఉచిత సీట్లు పొందుతున్నారు. దీంతో గ్రామీణ విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల్లో సీట్లను పొందలేకపోతున్నారు.

నోటిఫికేషన్ విడుదల..

ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులు ఉచిత సీట్లు పొందేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ కూడా ఈ నెల 2వ తేదీ నుంచి ప్రారంభమైంది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు 2009 జూలై 2వ తేదీన కేంద్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ చట్టం ప్రకారం అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులకు 5 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 10 శాతం, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు చెందిన నిరుపేద పిల్లలకు 10 శాతం సీట్ల ప్రకారం మొత్తం 25 శాతం సీట్లను కేటాయించాల్సి ఉంటుంది. డ్రాపౌట్లు లేకుండా చర్యలు చేపట్టడమే కాకుండా, పాఠశాలల్లో సీట్లు పొందిన విద్యార్థుల నుంచి అడ్మిషన్లకు డొనేషన్లు, ఎలాంటి ఫీజులు వసూలు చేయకూడదు వంటి నిబంధనలు కూడా ఉన్నాయి.

గ్రామీణ విద్యార్థులకు శాపంగా నిబంధనలు..

ఉచిత సీట్ల కేటాయింపులో ప్రభుత్వ నిబంధనలు గ్రామీణ పేద విద్యార్థులకు శాపంగా మారాయి. ప్రైవేట్ పాఠశాలలో సీట్లు పొందేందుకు విద్యార్థి నివాసం నుంచి ఒక కిలోమీటరు పరిధిలో ఉన్న వారికి మొదటగా అవకాశం కల్పిస్తారు. కిలోమీటర్ పరిధిలోని విద్యార్థుల సీట్లు కేటాయింపులో మిగిలి ఉంటే 3 కిలోమీటర్ల పరిధిలో ఉన్న విద్యార్థికి కేటాయించేందుకు అవకాశం ఉంది. ప్రైవేట్ పాఠశాలలు పట్టణాల్లోనే ఉండటంతో ఆ పరిసర ప్రాంతాల వారికే ఉచిత సీట్లు దక్కుతాయి. దీంతో గ్రామీణ పేద విద్యార్థులకు దక్కే అవకాశం లేదు. ప్రభుత్వం నిబంధనలను సడలించి ఉచిత సీట్లు కేటాయింపులో గ్రామీణ విద్యార్థులకు కూడా సీట్లు పొందేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయింపునకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మీ సేవా, ఆన్‌లైన్ సెంటర్‌లకు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈనెల 2వ తేదీ నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది.

– చేగిరెడ్డి రమణారెడ్డి, ఎంఈఓ, బేస్తవారిపేట

మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలి

ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో నిబంధనలు సడలించాలి. ఒక కిలో మీటరు, మూడు కిలో మీటర్ పరిధి విధించడం ద్వారా గ్రామీణ విద్యార్థులకు సీట్లు పొందే అవకాశం లేకుండా పోతుంది. మండలాన్ని యూనిట్‌గా సీట్లను కేటాయిస్తే గ్రామీణ విద్యార్థులకు ఉచిత సీట్లు పొందే అవకాశం కలుగుతుంది.

– వేగినాటి ఓసూరారెడ్డి, ఎంపీపీ, బేస్తవారిపేట

కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్

- మాజీ ప్రభుత్వ అధికారులపై అక్రమ కేసులు అన్యాయం
- కూటమి ప్రభుత్వంలో విజృంభిస్తున్న లిక్కర్ మాఫియా
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన జూపూడి, బూచేపల్లి వెంకాయమ్మ, చుండూరి

ఒంగోలు సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచకాలపై మండిపడ్డారు. మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, మాజీ ప్రభుత్వ అధికారి కృష్ణమోహన్‌రెడ్డిలకు మద్యం పాలసీతో సంబంధం లేకపోయినా అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టు చేయడాన్ని ఖండించారు. లేని స్కాంలను సృష్టించి తప్పుడు సాక్ష్యాలతో నచ్చిన విధంగా స్టేట్‌మెంట్లు రాసుకొని ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. జీవితంలో ఒక్క కేసు కూడా లేని నిజాయితీపరులైన అధికారులను రాజకీయ కక్షతో బలి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం కేసు రాజకీయ దురుద్దేశంతో పెట్టినట్లు ఉందని, రాజకీయ ప్రతీకారంతో కేసులు పెడితే తగిన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోందని సుప్రీం కోర్టు తీవ్రంగా హెచ్చరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 2014–2019 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో లిక్కర్ మాఫియా నడిపించడం నిజం కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు లిక్కర్ వ్యవహారాన్ని ప్రైవేట్ మాఫియాకు అప్పగించి కమీషన్లు దండుకోవడం ప్రజలంతా చూస్తున్నారన్నారు. మద్యం దుకాణాలకు పదింతలు బెల్ట్ షాపులు పెట్టి గ్రామీణ ప్రాంతాల్లో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారన్నారు. మంచినీళ్లు లేక గ్రామీణ ప్రాంత ప్రజలు అల్లాడుతుంటే ఇంటింటికీ మద్యం సరఫరా చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో మద్యం మాఫియా నడ్డి విరగ్గొట్టి బెల్ట్ షాపులను తీసేసి మద్యం విక్రయాలపై నియంత్రణ విధించామన్నారు. ప్రభుత్వం మద్యం అమ్మితే విమర్శలు చేస్తున్న కూటమి పాలకులు ప్రైవేట్ మాఫియాకు మద్యం వ్యాపారాన్ని అప్పగించడాన్ని సమర్థించుకోవడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో లిక్కర్ మాఫియా విజృంభిస్తోందని, బెల్ట్ షాపులు పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసుకొని ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారన్నారు. పాలనలో ఘోరంగా విఫలమైన చంద్రబాబు ప్రజల దృష్టిని మరల్చేందుకే తప్పుడు కేసులు నమోదు చేసి డైవర్షన్ చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలకు చరమగీతం పాడి సూపర్‌సిక్స్ పథకాలను అటకెక్కించారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తున్న ప్రజలను, సోషల్‌మీడియా యాక్టివిస్టులను, ప్రజా పోరాటాలకు అండగా నిలుస్తున్న ప్రతిపక్ష పార్టీలను అణిచివేసే కుట్రలకు పాల్పడుతున్నారని చెప్పారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని తప్పులను చంద్రబాబు చేస్తున్నారని, చట్టాన్ని గౌరవించకుండా న్యాయ ప్రక్రియను సక్రమంగా అమలు చేయకుండా తప్పుడు సంప్రదాయాలతో వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేస్తున్నారని తీవ్రంగా దుయ్యబట్టారు.

మద్యం రూ.99కే..ఎకరం భూమి 99 పైసలే..

రాష్ట్రంలో మద్యాన్ని రూ.99లకు విక్రయిస్తూ కోట్ల విలువైన భూమిని మాత్రం 99 పైసలకే విక్రయిస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్‌రావు విమర్శించారు. ప్రపంచీకరణను అమలు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. చంద్రబాబు హయాంలో జరిగిన మద్యం అవినీతిలో నమోదైన కేసుపై బెయిల్ తీసుకొని బయట తిరుగుతున్నాడని చెప్పారు. ఎన్‌టీ రామారావు మద్యాన్ని నిషేధిస్తే దానికి తూట్లు పొడిచి రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారిస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో బెల్టుషాపులను పూర్తిగా తొలగించామని, కానీ కూటమి ప్రభుత్వంలో గ్రామానికి నాలుగైదు బెల్టుషాపులు ఏర్పాటు చేశారని మండిపడ్డారు.

తప్పుడు కేసులు సరికాదు

కక్ష్య సాధింపు రాజకీయాలు మానుకొని ప్రజలకు మేలు చేసే ఆలోచనలు చేయాలని ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు అన్నారు. ప్రభుత్వాధికారులపై తప్పుడు కేసులు బనాయించడం, కేసులు పెట్టి వేధించడాన్ని రాష్ట్ర ప్రజలంతా చూస్తున్నారన్నారు. అక్రమ కేసులు పెట్టడం మానుకొని ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలన్నారు. మద్యంలో కూటమి ప్రభుత్వం కోట్ల రూపాయలు దండుకుంటుంతోదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్‌ఖాన్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నె శ్రీధర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వాములు కండి

- బీట్ ద హీట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా



స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, అధికారులు

కొత్తపట్నం: వేసవిలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని అల్లూరులో బీట్ ద హీట్ అనే కార్యక్రమం నిర్వహించారు. తొలుత బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం రాజీవ్ కళామందిర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. గ్రామాల్లో సేకరించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించి చెత్తను ఎరువుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అల్లూరు గ్రామాన్ని కూడా విజువల్ క్లీన్ వీలేజ్‌గా తీర్చిదిద్దేలా గ్రామస్తులు కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామంలో అనేక పనులు చేపడతామన్నారు. గ్రామంలోని చెరువులను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలను పంపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికీ చెత్త సేకరణ ఏ విధంగా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

మండలంలో 15 పంచాయతీల్లో పెండింగ్ పనులు ఉన్నాయని, పూర్తి చేయాలని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి కలెక్టర్‌ను కోరారు. గత ప్రభుత్వ హయాంలో గ్రావెల్, మట్టి రోడ్లకు రూ.11 కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులు ఇప్పుడు నిలిచిపోయాయని, వాటిని తిరిగి మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అల్లూరు చెరువులో నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో డీకే భూములు 70 శాతం ఉన్నాయని, వాటిని వారి వారసుల పేర్లపై మార్చడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమానికి సంబంధించిన ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ, ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, డీపీఓ వెంకటనాయుడు, డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూస్ ఎస్ఈ బాల శంకరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ పి.మధుసూధన్‌రావు, ఎంపీడీఓ శ్రీకృష్ణ, ఈవోఆర్డీ వేణుగోపాల్ మూర్తి, ఎంపీటీసీ మిట్నసల శాంతారావు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

19వ రోజుకు చేరిన సీహెచ్‌ఓల సమ్మె

ఒంగోలు టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన సమ్మె శనివారం 19వ రోజుకు చేరింది. సమ్మెలో వుయ్ వాంట్ జస్టీస్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీఎంసీఏ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే సీహెచ్‌ఓల్లో 85 శాతం మహిళలు పనిచేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాలు, కొండప్రాంతాల్లో పనిచేసే మహిళలు అభద్ర వాతావరణంలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల మధ్య రాత్రి 8 గంటల వరకు హెడ్ క్వార్టర్స్‌లో ఉండి ముఖ హాజరు వేయాలని కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీస్ వెల్ఫేర్ ఉత్తర్వులను జారీ చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఏపీఎంసీఏ నాయకులు షేక్ ఆదిల్, గంటా ప్రసన్న, జీవనజ్యోతి, పసుపులేటి శైలజ, దీప్తి, కామేష్, రమాదేవి పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద సమ్మెలో పాల్గొన్న సీహెచ్‌ఓలు

పిడుగుపాటుకు 22 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

రాచర్ల: పిడుగుపాటుకు 22 గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే..జేపీచెరువు గ్రామానికి చెందిన ఒంటేరు రంగయ్య, పామూరు శ్రీనివాసులు, గోతం వలి కలిసి గొర్రెల మేత కోసం నల్లమల అటవీ ప్రాంతానికి వెళ్లారు. ఆ సమయంలో ఉరుములు, మెరుపులతో పిడుగుపాటుకు 22 గొర్రెలు మృతి చెందాయి. ఒంటేరు రంగయ్యకు చెందిన 12 గొర్రెలు, పామూరు శ్రీనివాసులకు చెందిన 5, గోతం వలికి చెందిన 5 గొర్రెలు మృతి చెందాయి. వాటి విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని బాధితులు వాపోయారు.

క్లుప్తంగా

నల్లమల అటవీ ప్రాంతంలో
భారీ వర్షం

● రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు సమీపం నల్లమల అటవీ ప్రాంతంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, గాలితో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, భారీ వర్షం కారణంగా నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయం సమీపంలోని లక్ష్మమ్మ వనం వద్ద భారీ చెట్టు కూలి రోడ్డుకు అడ్డంగా పడింది. రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలడంతో నెమిలిగుండ్ల రంగనాయకస్వామి దర్శనం కోసం వెళ్లిన భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై కోటేశ్వరరావు సంఘటన స్థలానికి చెరుకుని జేసీబీల సాయంతో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగించారు. మిషన్లతో చెట్టు కొమ్మలను కత్తిరించి పక్కకు తిప్పించారు. అనంతరం ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలను పంపించారు. భారీ వర్షం కారణంగా కొండపై నుంచి వరద నీరు అధికంగా వచ్చింది. చాలా కష్టంతో భక్తులు వాగు దాటారు. ఉరుములు, మెరుపులు, గాలితో కూడిన భారీ వర్షం కారణంగా ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.


భారీ వర్షం కారణంగా రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు


కోల్డ్ స్టోరేజీ వద్ద ఉన్న మిర్చి బస్తాల ట్రాక్టర్లు


ఆరబోసిన మిర్చిని చూపుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు


ట్రాక్టర్‌తో కోల్డ్ స్టోరేజికి మిర్చి బస్తాలను తరలిస్తున్న రైతు


తడిసి రంగుమారిన మిర్చిని కుప్పగా పోస్తున్న రైతు

మిర్చి రైతు కంట్లో కారం

కూటమి ప్రభుత్వం మిర్చి రైతు కంట్లో కారం కొడుతోంది. మార్కెట్లో గిట్టుబాటు ధర లభించక రైతులు అల్లాడిపోతున్నారు. గుంటూరు యార్డులోనే క్వింటా ధర రకాన్ని బట్టి రూ.8500 నుంచి రూ.10 వేల మధ్య పలుకుతోంది. జిల్లాలో మిర్చి కొనుగోలు కేంద్రం లేకపోవడంతో గుంటూరు వెళ్లి మిర్చి యార్డులో అమ్ముకోవాల్సిన పరిస్థితి. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి క్వింటా మిర్చిని రూ.11,740కి కొనుగోలు చేయిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నమ్మబలికి రెండు నెలలు కావస్తోంది. ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో క్వింటా మిర్చి రూ.18 వేల నుంచి రూ.25 వేల వరకు పలికింది. దీంతో మిర్చి రైతులు లాభాల బాట పట్టారు. మళ్లీ జీవితంలో ఆ పరిస్థితులను చూడలేమనుకుంటూ రైతులు నిట్టూరుస్తున్నారు. - సాక్షి,ఒంగోలు


కోల్డ్ స్టోరేజిలో ఖాళీ లేక పొలంలో మిర్చిని ఆరబోసి కప్పిన పట్టలు


రాత్రి వేళ బస్తాల్లో ఉంచిన మిర్చిని పగలు ఆరబోసుకుంటున్న రైతు

సంక్షేమ పథకాల అమలు జగనన్నకే సాధ్యం

● వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి

పీసీపల్లి: ఇచ్చిన మాటకు కట్టుబడి పేదల కోసం సంక్షేమ పథకాలు అమలు చేయడం జగనన్నకే సాధ్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. పాలేటి గంగమ్మ తిరునాళ్లలో భాగంగా వెంగలాపురం సమీపంలో పాలేటి నది ఒడ్డున వెలసిన గంగమ్మ ప్రాంగణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాతకొట్టు పిచ్చిరెడ్డి, ఎన్నికల శ్రీనివాస్‌రెడ్డి, వడ్డంపుడి వెంకటేశ్వర్లు, వెంకట భాస్కర్, మరిమి వెంకటేశ్వర్లు చౌదరి, చెన్నుపాటి వెంకటేశ్వరరావు చౌదరి ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ ఒంగోలు ఇన్‌చార్జి చుండూరు రవిబాబు, కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్, చింతలచెరువు సత్యనారాయణరెడ్డితో కలిసి శుక్రవారం రాత్రి ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే బూచేపల్లి మాట్లాడుతూ మళ్లీ సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగనన్న సీఎం కావాలని ప్రజలంతా కోరుతున్నారన్నారు. ఏ పంటకూ గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడిపోతున్నారని, పొగాకు, కంది రైతులంతా రోడ్డును పడ్డారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా వలంటీర్ వ్యవస్థ కొనసాగిస్తానని చెప్పి పది వేల జీతం ఇస్తానని చంద్రబాబు మోసగించారని బూచేపల్లి ధ్వజమెత్తారు. ఇది దోచుకుని దాచుకునే ప్రభుత్వమేనని, సంక్షేమ పథకాలు గాలికి వదిలారని మండిపడ్డారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లివెంకాయమ్మ మాట్లాడుతూ చంద్రబాబు ఓడిపోతారన్న భయంతోనే ఉమ్మడిగా వచ్చి మోసపూరితమైన మాటలు ప్రజలకు చెప్పి గెలిచారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను 100 శాతం అమలు చేయడం వైఎస్ కుటుంబానికే సాధ్యమన్నారు. ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ చంద్రబాబు సంక్షేమ, పరిపాలన గాలికి వదిలి విలాసాలకి సొంతంగా ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు. ఇది సంక్షేమ ప్రభుత్వం కాదని సంక్షోభ ప్రభుత్వమని విమర్శించారు. చుండూరి రవిబాబు మాట్లాడుతూ రైతులు తరఫున గళం విప్పేందుకు త్వరలో జగనన్న జిల్లాకు వస్తున్నారని, మనమంతా కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ తాను అతి సామాన్యుడినని, మీలో ఒక్కడినని, ఎమ్మెల్యేగా అభ్యర్థిగా తనను ప్రకటించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబం పట్ల ఎప్పుడూ కృతజ్ఞుడినై ఉంటానని స్పష్టం చేశారు. రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ పేరుతో అందరినీ బెదిరిస్తోందని, ఉడత ఊపులకు, తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడేవారు లేరన్నారు. కార్యక్రమంలో కేవీ రమణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, ఓకే రెడ్డి, పోలు జయరామ్‌రెడ్డి, మడతల కస్తూరిరెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, మూల రాజశేఖర్‌రెడ్డి, కోన్ నరసింహారావు, లింగాలది నరసింహారెడ్డి, మడతల ఓబుల్‌రెడ్డి, నరాల కొండారెడ్డి, రేగుల బాలయ్య, భూమిరెడ్డి కొండారెడ్డి, శ్రీకాంత్, ఎర్రంరెడ్డి మోహన్‌రెడ్డి, తమ్మినేని సుజాత పాల్గొన్నారు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి, వేదికపై వెంకాయమ్మ, ఎమ్మెల్యే తాటిపర్తి, దద్దాల


భారీగా తరలి వచ్చిన జనం

ఆలయం వద్ద స్తంభించిన ట్రాఫిక్

రాచర్ల: మండలంలోని నెమలిగుండ్లరంగనాయక స్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కార్లు, ఆటోలు, మోటారు సైకిళ్లు అధిక సంఖ్యలో రావడంతో ట్రాఫిక్ ఏర్పడింది. లక్ష్మమ్మ వనం నుంచి నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయానికి సుమారు కిలో మీటర్ ఉంటుంది. స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఆలయానికి వెళ్లేందుకు కార్లు, ఆటోలు, మోటారు సైకిళ్లు ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేశారు. దీంతో వచ్చేపోయే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గంటపాటు ట్రాఫిక్ స్తంభించిపోవడంతో కాలినడక వెళ్లే భక్తులు అనేక ఇబ్బందులు పడ్డారు. దేవస్థానానికి సంబంధించిన సిబ్బంది ఎలాంటి చర్యలు చేపట్టక పోవడంతోనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దేవస్థానం అధికారులు, పోలీసులు చర్యలు తీసుకుని రంగస్వామి ఆలయం వద్ద వాహనాలు పార్కింగ్ చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.


ఆలయానికి వెళ్లే మార్గంలో నిలిచిన వాహనాలు

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని అడ్డుకున్న గ్రామస్తులు

బేస్తవారిపేట: మండలంలోని పీవీ పురంలో పేరంటాలమ్మ-పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా శనివారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. పోటీలు ప్రారంభించేందుకు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వెళ్లారు. పార్టీలకు అతీతంగా పండగ జరుపుకుందామని, వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకులను ఎవరినీ బండ పందేలు ప్రారంభించేందుకు పిలవొద్దని గ్రామ పెద్దలు, కమిటీ మెంబర్లు ముందే తీర్మానం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు ఎవరికీ చెప్పకుండా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని పిలిపించి బండ ఎక్కించేందుకు ప్రయత్నించారు. గ్రామస్తులు, కమిటీ మెంబర్లు అడ్డుకున్నారు. గ్రామరాశి డబ్బుతో బండలాగుడు పోటీలు పెట్టామని, పార్టీల మధ్య గొడవలు వస్తాయని రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానించొద్దని ముందే నిర్ణయించుకున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గంట సేపు టీడీపీ నాయకులు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి ఎంత ప్రయత్నించినా గ్రామస్తులు ఒప్పుకోలేదు. చేసేది లేక బండలాగుడు ఎద్ల ముందు నిలబడి గ్రూప్‌ఫొటో దిగి ఎమ్మెల్యే ముత్తుముల వెనక్కి వెళ్లిపోయారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్య

మార్కాపురం: కుటుంబ వివాదాల నేపథ్యంలో మండలంలోని కొండేపల్లిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు తెలిపారు. గ్రామానికి చెందిన కేవీ నారాయణరెడ్డి (55) ఈ నెల 15వ తేదీన పాయిజన్ తీసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆయన్ను తొలుత స్థానిక జీజీహెచ్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ నారాయణరెడ్డి శనివారం ఉదయం మృతి చెందినట్లు రూరల్ ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అక్రమ అరెస్టులు

● మాజీ ఎమ్మెల్యే జంకె

మార్కాపురం: సీఎం చంద్రబాబుకు పాలన చేతగాక హామీల అమలులో తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి మండిపడ్డారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నియంతపాలన సాగుతోందని ధ్వజమెత్తారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలులో భాగంగా ఐఏఎస్ అధికారులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. హామీల అమలు విషయంలో అన్నీ వర్గాల ప్రజల నుంచి ప్రభుత్వంపై వచ్చిన వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు, ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా అవినీతికి ఆస్కారం లేకున్నా మద్యం స్కామ్ జరిగినట్లు తప్పుడు వాంగ్మూలాలను సృష్టించి ఆయనకు సన్నిహితంగా ఉన్న వారిని అరెస్టు చేస్తున్నారని జంకె ఆరోపించారు. వైఎస్సార్ సీపీ హయాంలో బెల్టుషాపులు పూర్తిగా రద్దు చేసి మద్యం షాపులను తగ్గించి అమ్మకాలు తగ్గిస్తే స్కాం జరిగిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న దాదాపు అన్నీ డిస్టలరీలకు చంద్రబాబే అనుమతులు ఇచ్చారని, వైఎస్సార్ సీపీ పాలనలో ఒక్క డిస్టలరీకి కూడా వైఎస్ జగన్ ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. వీధి వీధినా బెల్టుషాపులు తెరిచి 24 గంటలూ ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలు చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబుకు దమ్ముంటే ఇన్నర్ రింగ్‌రోడ్ స్కామ్, లిక్కర్ స్కాం, ఏపీ ఫైబర్ నెట్, స్కిల్ డెవలప్‌మెంటు కుంభకోణాలపై విచారణకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన ఏడాదిలోనే రాష్ట్రంలో పాలన వెనక్కి వెళ్లిందన్నారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లనే కాకుండా పారిశ్రామికవేత్తలను కూడా బెదిరిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం బెదిరింపులతో ఎవరూ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావడం లేదని, అరాచక పాలనతో ప్రజా చైతన్యాన్ని అడ్డుకోలేరన్నారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీ నేతృత్వంలో ప్రజా ఉద్యమాలతో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని జంకె హెచ్చరించారు.


మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి

ట్రాక్టర్ల సామగ్రి దొంగకు బేడీలు

పుల్లలచెరువు: ట్రాక్టర్ల సామగ్రి దొంగను పోలీసులు కటకటాల వెనక్కి నెట్టి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను యర్రగొండపాలెం సీఐ ప్రభాకర్ స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం విలేకరులకు వెల్లడించారు. ముటుకుల, కొండారెడ్డి కొష్టాలకు చెందిన రైతులు వాగ్యానాయక్, విష్ణువర్ధన్‌రెడ్డిలు ఈ నెల 10వ తేదీన తమ పొలంలో ట్రాక్టర్, ట్రాలీ, రోటావేటర్‌ను దొంగలు అపహరించారని ఫిర్యాదు చేశారు. సీఐ ప్రభాకర్ నేతృత్వంలో ఎస్ఐ సంపత్‌కుమార్ తమ సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడి కేసును ఛేదించారు. సీఐ ప్రభాకర్ కథనం ప్రకారం.. నిందితుడి కోసం పోలీసులు అందుబాటులో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అనుమానం ఉన్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడు పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం మృత్యుంజపురానికి చెందిన దూదేకుల హుస్సేన్‌గా తేలింది. అతను ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. వ్యవసాయ పనులకు ట్రాక్టర్ డ్రైవర్‌గా వెళ్తుండేవాడు. చెడు వ్యసనాలకు బానిసై తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో పొలాల్లో ఉండే రొటావేటర్లు, కల్టివేటర్లు, ట్యాంకర్‌లను దొంగలించి వాటిని అమ్ముకునేవాడు. ఈ క్రమంలో మార్చి 23వ తేదీన ఐటీవరంలో ట్రక్కు, రోటావేటర్‌ను దొంగలించి వాటిని తన స్వగ్రామం తీసుకెళ్లాడు. ఈ నెల 9వ తేదీన త్రిపురాంతకంలో నీటి ట్యాంకర్‌ను దొంగలించాడు, మే 10న మానేపల్లి వద్ద ట్రాక్టర్‌ను, ట్రాలీను తీసుకెళ్లాడు. మళ్లీ దొంగతనం చేసేందుకు తన ట్రాక్టర్‌తో ముటుకుల వస్తుండగా పక్కా సమాచారంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేసి నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడి నుంచి ట్రాక్టర్, రెండు రోటావేటర్‌లు, నీళ్ల ట్యాంకర్, రెండు ట్రక్కులు స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తు విలువ రూ.14.60 లక్షలు ఉంటుందని సీఐ ప్రభాకర్ మీడియాకు వెల్లడించారు. నిందితుడి దూదేకుల హుస్సేన్‌ను అరెస్టు చేసి కటకటాల వెనక్కి నెట్టినట్లు ఆయన వివరించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రభాకర్

ఎస్పీ ప్రత్యేక అభినందనలు

కేసును అతి తక్కువ సమయంలో ఛేదించడంలో కీలకప్రాత పోషించిన డీఎస్పీ నాగరాజు, సీఐ ప్రభాకర్, ఎస్ఐ సంపత్‌కుమార్, ఏఎస్ఐ ప్రసాద్, సిబ్బంది రమేష్, అరుణ్‌కుమార్, వీరాంజనేయులు, నాగరాజు, సురేష్, కాశీబాబు, శివనాగరాజులను ఎస్పీ దామోదర్ అభినందించారు. ఎస్పీ రివార్డులు ప్రకటించగా వాటిని సంబంధిత సిబ్బందికి అందించినట్లు సీఐ ప్రభాకర్ వివరించారు.

చోద్యంగాక ఇంకేంటి?

పొదిలి రూరల్: మూసీవాగు సమీపంలో ఉన్న రైతులు తమ సొంత పొలాల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఏళ్లతరబడి సాగు చేసుకుంటున్నారు. పంటలు పండించుకుంటూ పశువులకు మేత పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ వ్యవహారం మూసీవాగు పరిసర ప్రాంతంలో చాలాకాలంగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ భూమిపై కొందరు కూటమి నాయకులు కన్నేశారు. ఎలాగైనా వీటిని తమ చేతుల్లోకి తెచ్చుకోవాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా నెల క్రితం కూటమి నాయకులు అధికారులను కలిశారు. కొందరు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని, ఆక్రమణదారుల చెర నుంచి ఆ భూమిని విడిపించాలని కోరారు. కూటమి నేతలకు తలొగ్గిన అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. ఆక్రమణలు తొలగించాలని కొందరు రైతులకు మాత్రమే చెప్పారు. మిగిలిన రైతులను పట్టించుకోలేదు. అందరిపై చర్యలు తీసుకోవాలని, కొందరికి మాత్రమే భూములు ఖాళీ చేయాలని చెప్పడం ఏమిటని బాధిత రైతులు ప్రశ్నించారు. చివరకు కొందరు రైతులకు మాత్రమే అధికారులు నోటీసులు ఇచ్చారు. దీనికి రైతులు ప్రస్తుతం పశుగ్రాసం ఉందని, కోతలైన వెంటనే తొలగిస్తామని సమాధానం చెప్పారు. అయినా రెవెన్యూ సిబ్బంది వినకుండా పొదిలి మండలం కుంచేపల్లి పంచాయతీలోని దాసళ్లపల్లి గ్రామ సంర్వే నెంబరు 11, కుంచేపల్లిలో సర్వే నెంబరు 25, 17 సర్వే నంబర్లలో ఉన్న 17 ఎకరాల వాగు పోరంబోకు భూమిలో ఆక్రమణలు జరిగాయని వారం క్రితం 8 మంది రైతులకు నోటీసులు ఇచ్చారు. 8 మందిలో కుంచేపల్లికు చెందిన పేరం నాగిరెడ్డి, మేడం నారాయణరెడ్డి, పేరం శ్రీనివాసరెడ్డి, బాదం శ్రీనివాసరెడ్డి ,దాసళ్లపల్లికు చెందిన గంగుల వెంకట్రావు, సీదా తిరుపతయ్య, గంగుల నరసింహారావు, గంగుల అచ్చయ్య ఉన్నారు. శనివారం ఆక్రమణలు తొలగించేందుకు తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి పోలీసులు, జేసీబీతో వచ్చారు. పశువుల కోసం సాగు చేసుకున్న పశు గ్రాసాన్ని పొక్లెయిన్‌తో ధ్వంసం చేశారు. పొలం చుట్టూ ఉన్న గట్లను చదును చేసి తొలగించారు. కొంతమంది రైతులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. రెండు నెలల్లో తీసివేసే పశుగ్రాసాన్ని యంత్ర సాయంతో తొలగించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ ఆక్రమణలు తొలగించాలనుకుంటే మూసీవాగుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి తీసివేయాలని, అధికారులు వివక్ష చూపారని మండిపడుతున్నారు. దీనిపై తహసీల్దార్ కృష్ణారెడ్డిని వివరణ కోరగా ముందుగా వచ్చిన ఫిర్యాదుపై రైతులకు నోటీసులు ఇచ్చామని, ఆ తర్వాత మిగిలిన వారికి కూడా నోటీసులు ఇచ్చి తొలగిస్తామని స్పష్టం చేశారు.


పశు గ్రాసాన్ని ధ్వంసం చేయించేందుకు వచ్చిన తహసీల్దార్, ఎస్సై